# ఐటీ, పారిశ్రామిక కారిడార్‌గా ఆలేరు

**ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పుతాం**

- యువతకు ఉపాధి కల్పిస్తాం
- కొండపోచమ్మ సాగర్, నవాబ్‌పేట జలాశయంతో బీడుభూములు సస్యశ్యామలం
- నియోజకవర్గంలో రూ.5 వేల కోట్ల అభివృద్ధి పనులు చేశాం
- పునర్నిర్మాణంతో ఇల వైకుంఠంగా మారిన యాదగిరి గుట్ట ఆలయం
- ప్రజల ఆశీస్సులతో మరోమారు గెలిచి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇస్తా
- బీఆర్‌ఎస్ ఆలేరు అభ్యర్థి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి



యాదగిరిగుట్ట, నవంబర్28: పదేళ్ల కాలంలో 5 వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపాం. నియోజకవర్గ ప్రజలు దీవెనలతో 2023 సాధారణ ఎన్నికల్లో 50 వేల మెజార్టీతో గెలిచి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి మంగళవారం నమస్తే తెలంగాణతో ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు. ఆమె మాటల్లోనే..

## ప్రచారంలో విశేష స్పందన..

నా భర్త డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో కలిసి నిత్యం ప్రజల్లోనే ఉంటూ సేవ చేస్తున్న. నెలరోజుల పాటు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రచారం చేపట్టాం. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎక్కడికి వెళ్లినా మహిళలు, యువత, విద్యార్థులు బ్రహ్మరథం పట్టారు. అభివృద్ధి ఆగిపోతుందేమోనని కారు గుర్తుకే ఓటేస్తామని చెబుతున్నారు. మార్పు కోరుతున్నారని చాలామంది సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ వస్తే 24 గంటల కరెంట్, ధరణి, రైతుబంధు నిలిచిపోతుందన్న భయం వారిలో ఉంది. ఖచ్చితంగా 80 నుంచి 85 శాతం ప్రజలు సీఎం కేసీఆర్‌కే మద్దతుగా నిలుస్తారన్న నమ్మకం ఉంది. గతంలో పోలిస్తే ఈ సారి 50 వేల మెజార్టీతో గెలువబోతున్నాం.

## యువతకు ఉపాధి కల్పిస్తాం..

హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఆలేరు నియోజకవర్గానికి ఐటీ, పారిశ్రామిక కారిడార్‌ను తీసుకురావాలన్న లక్ష్యంతో పని చేస్తాం. ఇప్పటికే తుర్కపల్లిలో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ మంజూరైంది. సర్వే నంబర్ 72 లో 93.21 ఎకరాల భూసేకరణ చేశాం. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం కూడా చెల్లించాం. ఈ పార్కు అందుబాటులోకి వస్తే పర్యావరహిత పరిశ్రమలు పెద్దఎత్తున తరలిరానున్నాయి.యాదగిరిగుట్ట మండలంలోని దాతారుపల్లి గ్రామంలో 55 ఎకరాల్లో టూరిజం పార్క్‌ను ఏర్పాటు చేయనున్నాం. ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను అధికారులు సిద్ధం చేశారు. అనేక మందికి యువతకు ఉపాధి దొరుకనుంది.

## కాంగ్రెస్‌పై ప్రజలకు విశ్వాసం పోయింది..

గతంలో రూ. 200 పింఛన్, 3 గంటల కరెంటు ఇవ్వని కాంగ్రెస్ పార్టీ ఇప్పుడేదో చేస్తామంటే ప్రజల నమ్మే పరిస్థితిలో లేరు. ఆరు గ్యారెంటీలు విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ వాళ్ల ముఖ్యమంత్రి ఎవరో తేల్చుకోలేని స్థితిలో ఉంది. 24 గంటల కరెంట్ కట్ చేసి, ధరణిని రద్దు చేసి పాత కౌలుదారు పద్ధతిని తీసుకువస్తామని చెబుతుందని ప్రజలు భయపడిపోతున్నారు. ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థిపై భూకబ్జాల ఆరోపణలు ఉన్నాయి. ఆయన ఈసీకి పొందుపరిచిన అఫిడవిట్‌లోనే చూస్తే అర్థమవుతుంది. ఆయనపై భూ ఆక్రమణ కేసులను ప్రజలు గమనిస్తున్నారు. అధికారం లేనప్పుడే ఇలా ఉంటే, ఇక ఆయన ఎమ్మెల్యే అయితే నియోజకవర్గాన్నే అమ్మేస్తాడు. ఈ మధ్యకాలంలో రేవంత్‌రెడ్డి నాపై ఆరోపణలు చేశారు. యాదగిరిగుట్ట చుట్టూ ఒక్క గుంట భూమి ఆక్రమించిన్నట్లు నిరూపిస్తే మేం రాజకీయాల నుంచి తప్పుకుంటామని సవాల్ చేసి వారం అవుతున్నా స్పందన లేదు.

### ప్రభుత్వ వైద్యకళాశాల..

సీఎం కేసీఆర్ చొరవతో యాదగిరిగుట్టలో వైద్య కళాశాల ఏర్పాటు కానుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 16న కళాశాల నిర్మాణానికి సీఎం కేసీఆర్ రూ.183కోట్లు కేటాయిస్తూ అనుమతులు జారీ చేశారు. కాలేజీ నిర్మాణానికి యాదగిరిగుట్టలోనే మూడు స్థలాలను ప్రభుత్వానికి ప్రతిపాదించాం. ఎన్నికల అనంతరం టెండర్ ప్రక్రియ పూర్తి చేసి సాధ్యమైనంత త్వరగా 20 ఎకరాల్లో అద్భుతంగా నిర్మించనున్నాం. 100 ఎంబీబీఎస్ సీట్ల సామర్థ్యంతోపాటు 26 విభాగాల ప్రభుత్వాసుపత్రి అందుబాటులోకి రానుంది.

## యాదగిరిగుట్ట అభివృద్ధి నా అదృష్టం..

65 ఏళ్ల పాలనలో అభివృద్ధికి నోచుకోని యాదగిరిగుట్ట క్షేత్రం ప్రపంచంలోనే గొప్ప ఇల వైకుంఠపురంగా రూపుదిద్దుకున్నది. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వ ఖాజాన నుంచి రూ. 1400 కోట్లతో పునర్నిర్మించారు. సగటున 20 నుంచి 30 వేల మంది, శని, ఆదివారాల్లో 50 వేలకు పైగా భక్తులను స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఆలయ అభివృద్ధిలో యాదగిరిగుట్ట చుట్టూ 30 కిలో మీటర్ల మేరకు భూముల ధరలు పెరిగాయి. ఆలయ భూ సేకరణ బాధితులను కడుపులో పెట్టుకుని కాపాడుకున్నాం. నా హయంలో యాదగిరిగుట్ట అభివృద్ధి జరుగడం అదృష్టంగా భావిస్తున్నాను.

## పదేండ్లలో 5 వేల కోట్ల అభివృద్ధి

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలేరుపై పెట్టిన ప్రత్యేక దృష్టితో పదేళ్ల కాలంలో రూ. 5 వేల కోట్లతో అభివృద్ధి చేసి చూపాం. మండలాల్లో గల ప్రధాన రోడ్లు అద్దంలా తీర్చిదిద్దాం. గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మించడంలో ఎంతో గొప్పగా పల్లెలు మారాయి. ఆర్‌అండ్‌బీ, ఈజీఎస్, ఎస్‌డీఎఫ్, పంచాయతీ రాజ్ రాష్ట్ర ప్రణాళిక నిధులతో నూతన బీటీ రోడ్లతో పాటు బీటీ రెన్యూవల్, అంతర్గత రోడ్డు, సీసీ రోడ్లు పనులు పూర్తయ్యాయి. దేవాదుల ఎత్తిపోతల పథకం కింద నిర్మించిన నవాబ్‌పేట రిజర్వాయర్ నుంచి ప్రత్యేక కాలువ ద్వారా గుండాల మండలానికి సాగుజలాలు తీసుకొచ్చాం. 2020లోనే కొండపోచమ్మ సాగర్ నుంచి తుర్కపల్లి ప్రధాన కాల్వ, మన్నెవారిపల్లి తుర్కపల్లి కాల్వల ద్వారా తుర్కపల్లి, బొమ్మలారామారం మండలాలకు సాగు జలాలు వచ్చాయి. 8 మండలాల్లో 3 మండలాలకు కాళేశ్వరం జలాలు అందాయి. రాబోయే ఐదేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టు 15వ ప్యాకేజీ డిస్ట్రిబ్యూటరీ కాలువ తుర్కపల్లి మండలంతో పాటు రాజాపేట మండలాలకు సాగుజలాలు అందిస్తాం. నృసింహస్వామి జలాశయం డిస్ట్రిబ్యూటరీ కాల్వల ద్వారా యాదగిరిగుట్ట, మోటకొండూర్, ఆలేరు, ఆత్మకూరు(ఎం) మండలాలకు సాగు నీళ్లను అందిస్తాం. దీంతోపాటు ఆలేరుకు అశ్వరావుపల్లికాల్వ, ఆత్మకూరు(ఎం), మోటకొండూర్ మండలాలకు బునాది కాల్వ ద్వారా కాళేశ్వరం జలాలను అందజేస్తాం. నియోజకవర్గంలోని 8 మండలాలకు సాగుజలాలు తీసుకొస్తాం. చివరి గుంటకు కాళేశ్వరం జలాలను అందించే లక్ష్యంగా పని చేస్తాం.

---

- నిత్యం జనాల్లో ఉన్నా.. కష్ట సుఖాలను పంచుకున్నా
- పదేండ్లలో రూ.5 వేల కోట్లతో ప్రగతిని పరుగులు పెట్టించా
- కరువును పారదోలాం.. తాగు, సాగునీటిని అందించాం
- సంక్షేమానికి చిరునామా బీఆర్‌ఎస్ సర్కార్
- త్వరలోనే నృసింహసాగర్ రిజర్వాయర్ పనులు పూర్తి
- భువనగిరికి ఐటీ హబ్.. బీబీనగర్ వరకు మెట్రో రైలు
- కాంగ్రెస్‌ను నమ్మితే గోస పడుతం.. మళ్లీ కరెంట్ కష్టాలే..
- మంచి మెజార్టీతో బీఆర్‌ఎస్‌ను దీవించండి

బీఆర్‌ఎస్ భువనగిరి అభ్యర్థి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి



**మరోసారి ఆశీర్వదిస్తే మిగిలిన అభివృద్ధి పూర్తి**

# చేసింది చాలా ఉంది.. చేయాల్సింది ఇంకా ఉంది..

ఇంటర్వ్యూ Interview

యాదాద్రి భువనగిరి, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : తనను మరోసారి ఆశీర్వదిస్తే భువనగిరిలో ఐటీ హబ్, బీబీనగర్‌కు మెట్రో రైలు తీసుకొస్తానని, అలాగే త్వరలోనే నృసింహసాగర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేసి కాళేశ్వరం జలాలను తీసుకొస్తానని బీఆర్‌ఎస్ భువనగిరి నియోజక వర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి తెలిపారు. భువనగిరి ప్రజలే తన బలం, బలగమని తన గెలుపు ఎప్పుడో ఖాయమైందని.. భారీ మెజార్టీ కోసమే తమ ఆరాటమని చెప్పారు. పలు అంశాలపై తన అభిప్రాయాలను మంగళవారం ఆయన నమస్తే తెలంగాణతో పంచుకున్నారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

## కరువును పారదోలాం..

నీతి, నిజాయితీ పరిపాలనే మా ఎజెండా. ఎక్కడా తప్పు చేయలేదు. పొరపాటు పడలేదు. నిత్యం జనంలో ఉన్నా. ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకున్నా. కుటుంబ సభ్యుడిలా మెదులుకున్నాను. 2014 కంటే ముందు భువనగిరిలో ఘోరమైన పరిస్థితులు ఉండేవి. తాగు, సాగునీరు లేదు. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నది. నాటి పాలకులు కనీసం పట్టించుకోలేదు. బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి అంటే ఏంటో చూపించాం. నాటి కరువును పారదోలాం. తాగు, సాగునీరు అందించాం.

## పదేండ్లలో ఎంతో మార్పు..

పదేండ్లుగా ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించా. అప్పటికీ ఇప్పటికీ ఎంతో మార్పు వచ్చింది. భువనగిరి నియోజక వర్గం ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నది. నియోజక వర్గంలోని గ్రామాల్లో 90 శాతం సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశాం. భువనగిరి, పోచంపల్లి మున్సిపాలిటీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేశాం. గల్లీగల్లీకి సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు వేయించాం. ఇప్పటికే మూసీ నదిపై వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. మూడోసారి గెలువగానే వాటిని పూర్తి చేస్తాం. అభివృద్ధి నిరంతర ప్రక్రియ. అది కొనసాగుతుంది.

## సంక్షేమానికి చిరునామా బీఆర్‌ఎస్..

నాటి కాంగ్రెస్ పాలనలో పేదింటి ఆడబిడ్డ కాన్పు కావాలంటే పుట్టేడు కష్టాలు పడేది. నేడు కేసీఆర్ పాలనలో బిడ్డ కడుపులో పడగానే న్యూట్రిషియన్ కిట్. బిడ్డ ప్రపంచాన్ని చూడగానే కేసీఆర్ కిట్. కాన్పు చేసి తల్లీబిడ్డలను 102 వాహనంలో ఇంటి కాడ దించుతున్నం. ప్రభుత్వ పథకాలన్నీ అర్హులందరికీ వర్తింపజేశాం. మ్యానిఫెస్టోలో చెప్పినవన్నీ చేసి చూపించాం. సంక్షేమానికి చిరుమానా బీఆర్‌ఎస్. సీఎం కేసీఆరే రాష్ట్రానికి శ్రీరామరక్ష.

### బీఆర్‌ఎస్‌ను ఓడించడం అనీల్ తరం కాదు..

పైళ్ల ఫౌండేషన్ ద్వారా వేలాది మందిని ఆదుకున్నా. ఆపదలో ఉంటే డబ్బులకు వెనుకాడలేదు. ఎవరొచ్చి అడిగినా సాయం చేశా. కాంగ్రెస్ అభ్యర్థి అనీల్‌కుమార్‌రెడ్డి స్థిమితం లేని మనిషి. నన్ను ఓడించడం ఆయన తరం కాదు. నాలుగు దశాబ్ధాలుగా భువనగిరిలో కాంగ్రెస్ ఎప్పుడూ గెలువలేదు. ఇప్పుడు కూడా గెలువదు. వంద శాతం కాంగ్రెస్ ఓడిపోవడం ఖాయం.

## ఐటీ హబ్.. మెట్రో రైలు

భువనగిరిలో ఐటీ హబ్ ఏర్పాటు చేస్తామని స్వయంగా సీఎం కేసీఆర్ ప్రకటించారు. దాంతో పాటు బీబీనగర్ వరకు మెట్రో రైలును తీసుకొస్తాం. దాని ద్వారా అనేక మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. నియోజక వర్గం మరింత అభివృద్ధి చెందుతుంది. భువనగిరిలో సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయిస్తా. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తా. ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పునకు పోరాడుతాను. గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పిస్తాం.

### కాంగ్రెస్ కావాల్నా.. కరెంట్ కావాల్నా ?

సీఎం కేసీఆర్ పాలనలోనే 24 గంటల కరెంట్, పుష్కలంగా సాగు, తాగునీరు అందుతున్నది. కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ కరెంట్ కష్టాలు వస్తాయి. 3 గంటల కరెంట్ కావాల్నా ? లేక 24 గంటల కరెంట్ కావాల్నా ? అనేది ప్రజలు ఆలోచన చేయాలి. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ప్రజలు నమ్మడం లేదు. కాంగ్రెస్‌వి పగటి కలలు. 55 ఏండ్లు పరిపాలించినా ఏం జరిగిందో ప్రజలు చూశారు. 10 ఏండ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని కండ్లజూస్తున్నారు. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి రికార్డు నెలకొల్పుతారు.

## నృసింహసాగర్ ద్వారా కాళేశ్వరం జలాలు..

రైతు బాగుండాలనేది సీఎం కేసీఆర్ లక్ష్యం. కాళేశ్వరం జలాల కోసం మన దగ్గర నృసింహసాగర్ ప్రాజెక్టును నిర్మిస్తున్నాం. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయి. రిజర్వాయర్ ముంపు బాధితులను అన్ని విధాలుగా అదుకుంటున్నాం. త్వరలోనే అన్ని పనులు పూర్తి చేసి కాళేశ్వరం జలాలు తీసుకొస్తాం.

## భువనగిరి గడ్డపై మళ్లీ గులాబీ జెండా ఎగురవేస్తాం

ప్రజల్లో స్పందన చాలా బాగుంది. జనం నుంచి మంచి ఆదరణ లభిస్తున్నది. భువనగిరి నియోజక వర్గంలో బీఆర్‌ఎస్ సైనిక దళం ఉన్నది. పార్టీ చాలా పటిష్టంగా ఉన్నది. ఎప్పుడు ఓటేద్దామా అనే ఉత్సాహంతో పని చేస్తున్నారు. గ్రామాల్లో ఈ స్పందన మరింత ఎక్కువగా ఉన్నది. మా గెలుపు ఎప్పుడో ఫైనల్ అయ్యింది. మేమంతా భారీ మెజార్టీ కోసం ఆరాటడుతున్నాం. భువనగిరి ఖిలాపై బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తాం. నియోజక వర్గ ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి తనను మరో సారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నా.